క్లుప్తంగా

మంత్రికి సమస్యల వినతి

కోవెలకుంట్ల: బీసీ జన సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, పట్టణానికి చెందిన రిటైర్డ్ ఎస్ఐ బాలాజీ సింగ్ బీసీ కులాల సమస్యలపై మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి శనివారం వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, బీసీలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సముచితస్థానం కల్పించాలని కోరారు.

ట్రాక్టర్ బోల్తా.. కార్మికుడికి గాయాలు


గాయపడిన గుజ్జుల చిన్న

బేతంచెర్ల: నాపరాళ్ల ట్రాక్టర్ బోల్తాపడి కార్మికుడు గాయపడిన ఘటన మండల పరిధిలోని గోర్లగుట్ట సమీపంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. బనగానపల్లె మండలం పలుకూరు గ్రామం నుంచి బేతంచెర్లకు నాపరాళ్ల లోడుతో వస్తున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తు గోర్లగుట్ట గ్రామ సమీపంలో బోల్తాపడింది. ట్రాలీలో ఉన్న లోడింగ్ కార్మికుడు గుజ్జుల చిన్న ఎడమ కాలికి తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం బేతంచెర్ల సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

బస్సు ఢీకొని వృద్ధుడికి గాయాలు


గాయపడిన రంగడు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల–నంద్యాల ఆర్ అండ్‌బీ రహదారిలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బస్సు ఢీకొని వృద్ధుడు గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు.. పట్టణంలోని ఇందిరా నగర్‌కు చెందిన రంగడు అనే వృద్ధుడు చేతికర్ర సాయంతో డివైడర్ వద్ద రోడ్డు దాటుతుండగా కోవెలకుంట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బస్టాండ్‌లో నుంచి ప్రొద్దుటూరుకు వెళుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది. రోడ్డుదాటుతూ కింద పడిన వృద్ధుడి పాదాలను బస్సు వెనుక టైర్లు నలిపేయడంతో రెండు పాదాలతో పాటు తలకు గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఉచిత అంబులెన్స్ సౌకర్యం

డోన్ టౌన్: స్థానిక వంద పడకల ఆస్పత్రిలో కమలాపురం సర్పంచ్ అర్జున్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్స్ వాహనాన్ని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ వైద్యులతో కలిసి శనివారం ప్రారంభించారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను కాపాడేందుకు ఈ వాహనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అనంతరం ఆస్పత్రిలో వైద్య సేవలపై ఆరా తీశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ హరికిషన్, అర్జున్ రెడ్డి, డీసీసీ మాజీ చైర్మన్ లక్కసాగరం లక్ష్మీరెడ్డి ఉన్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి


మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బీసీ

అవుకు: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయా శాఖల్లో పనుల పురోగతిపై చర్చించారు. రెవెన్యూ శాఖలో ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులు పొలాల వద్దకే వెళ్లి సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం అవుకు సీహెచ్‌సీని మంత్రి సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కోట వీధిలో సీసీ రోడ్డును ప్రారంభించారు. ఎంపీడీఓ వెంగన్న, తహసీల్దార్ మల్లికార్జున రెడ్డి, వైద్యులు అభినయ్, యమున, భారతీదేవి పాల్గొన్నారు.

కూటమిలో బయటపడ్డ కలహాలు

డోన్: కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తల మధ్య కలహాలు, కుమ్ములాటలు బయటపడుతూనే ఉన్నాయి. బీజేపీ డోన్ నియోజకవర్గ కన్వీనర్ యర్రగుంట్ల సందు వెంకటరమణపై అదే పార్టీకి చెందిన వడ్డే మహరాజ్ చెప్పు చూపించిన సంఘటన శనివారం వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో చోటు చేసుకుంది. కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం అనంతరం తన సొంత పనులు జరగకుండా సందు రమణ అడ్డు పడుతున్నాడని ఆగ్రహంతో ఊగిపోయిన వడ్డేమహరాజ్ అందరూ చూస్తుండగానే చెప్పుతో కొడతాను అంటూ హెచ్చరించారు. శనివారం రాత్రి సీఐ ఇంతియాజ్ బాషాకు ఫిర్యాదు చేశారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

డోన్ రూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం కందుల కొనుగోలు కేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ప్రారంభించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కాగా ఈ కార్యక్రమానికి రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్‌కు ధర్మవరం సుబ్బారెడ్డిని పిలవకపోవడం గమనార్హం.


కోవెలకుంట్లలో ఓటరు ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



బేతంచెర్ల: గోర్లగుట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో..


బనగానపల్లెలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ర్యాలీ


ప్యాపిలిలో..

ప్రజాస్వామ్యంలో ఓటే ఆయుధం

- ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం
- ఓటు విలువపై అధికారుల అవగాహన


డోన్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం

కోవెలకుంట్ల: దేశభవిష్యత్తును నిర్ణయించే ఓటు వజ్రాయుధంతో సమానమని వక్తలు అభిప్రాయపడ్డారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం బనగానపల్లె, డోన్ నియోజకవర్గాల్లో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కోవెలకుంట్ల తహసీల్దార్ కార్యాలయంతో పాటు పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత, ప్రభుత్వ ఉన్నత, ఉర్దూ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రామసుబ్బారెడ్డి, ఇన్‌చార్జ్ ఆర్ఐ పుల్లయ్య మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య దేశంలో ఓటుకు చాలా ప్రాముఖ్యత ఉందన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. స్థానిక మెయిన్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అనేక పర్యాయాలు ఓటు హక్కు వినియోగించుకున్న పట్టణానికి చెందిన కాకి సుబ్బమ్మను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగేశ్వరరెడ్డి, చంటిరెడ్డి, నరేంద్రనాథ రెడ్డి, కృష్ణదాసు, అన్నపూర్ణ, సుభాష్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

బనగానపల్లెలో అవగాహన ర్యాలీ

బనగానపల్లె రూరల్: ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఓటు ఎంతో కీలకమని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ లలిత అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటరు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల నుంచి స్థానిక పెట్రోల్ బంకు కూడలి వరకు విద్యార్థులు, అధ్యాపకులు ర్యాలీ చేశారు. ప్రిన్సిపాల్ లలిత మాట్లాడుతూ.. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ప్రలోభాలకు లోనుకాకుండా తమ ఓటు వినియోగించుకోవాలని సూచించారు. అధ్యాపకుడు బడే సాహెబ్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో నిజాయితీ పరులైన నాయకులను ఎన్నుకుంటే దేశ ప్రగతికి బాటలు వేసినట్లు అవుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అధ్యాపకులు మహ్మద్‌గౌస్, సూర్యనారాయణరెడ్డి, బాబూనాథ్, నాగరాజారెడ్డి, కౌసల్యదేవి, సీతమ్మ రామన్న, ఉమామహేశ్వర్‌రెడ్డి, రిషీశ్వరుడు పాల్గొన్నారు.

బేతంచెర్ల: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వేయడం పౌరుల బాధ్యత అని తహసీల్దార్ ప్రకాష్ బాబు అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ప్రజలకు ఓటు విలువను వివరించారు. అలాగే మండల పరిధిలోని గోర్లగుట్ట ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం మద్దిలేటిరెడ్డి, ఉపాధ్యాయులు శివకుమారస్వామి, ఫర్హత్ జహాన్, నసీం ప్రతిజ్ఞ చేశారు.

ఓటు ఎంతో విలువైంది


కొలిమిగుండ్ల: ప్రతిజ్ఞ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

కొలిమిగుండ్ల: ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని.. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బాల ఈశ్వరరెడ్డి అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కార్యాలయంలో సీనియర్ ఓటర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. మండలంలోని ఆయా గ్రామాల పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అభివృద్ధి వైపు పయనించాలన్నా.. సరైనా పాలకులను ఎంచుకోవాలన్నా ఓటరు చేతిలోనే ఉందన్నారు. ప్రతి ఓటరు ఓటు హక్కు వినియోగించుకుంటే దేశ భవిష్యత్‌ను నిర్దేశించే అస్త్రం అవుతుందన్నారు.

ఓటరుగా నమోదు కావాలి

డోన్ టౌన్: ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావాలని స్థానిక పాతపేట జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. స్థానిక పాఠశాలలో విద్యార్థులకు ఓటరు దినోత్సవంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, వెంకటరమణ, వెంకటలక్ష్మి, బాబు, రాధా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

- ప్యాపిలి: స్థానిక బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటరు దినోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ భారతి, ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం ఓటుహక్కుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ప్రజలకు అందుబాటులో ఉండడం ముఖ్యం


సచివాలయ రికార్డులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ

బనగానపల్లె రూరల్: గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహించే సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ సతీష్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పలుకూరు గ్రామ సచివాలయంతో పాటు గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. సచివాయల సిబ్బంది ప్రజల నుంచి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా సచివాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.


బేతంచెర్ల: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ, ఎస్ఐ

హెల్మెట్‌తోనే ప్రమాదాల నుంచి రక్ష

బేతంచెర్ల: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని..ప్రమాదాల సమయంలో రక్షణ లభిస్తుందని సీఐ డి.వెంకటేశ్వరరావు, ఎస్ఐ రమేష్ బాబు అన్నారు. శనివారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా పోలీస్ సిబ్బందితో కలిసి డోన్, నంద్యాల క్రాస్ రోడ్డు, సంజీవ నగర్, హనుమాన్ కాలనీల మీదుగా హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. నిర్ణీత వేగంతోనే వాహనాలు నడపాలని, అతి వేగంతో వాహనాలు నడిపి ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దని సూచించారు.

టీడీపీ కార్యకర్తపై కేసు నమోదు

అవుకు: పట్టణానికి చెందిన టీడీపీ కార్యకర్తపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు శనివారం తెలిపారు. అవుకు తేరువీధిలో సీసీరోడ్ల ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి బీసీ జానార్ధన్‌రెడ్డి కోట వీధిలో పర్యటిస్తుండగా కోటవీధి మహిళలు అదే వీధికి చెందిన టీడీపీ కార్యకర్త ప్రేమ్ కుమార్ తమను దుర్భాషలాడుతున్నాడని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి బహిరంగంగా ఏమీ మాట్లాడకుండా స్థానిక ఎస్ఐ రాజారెడ్డిని పిలిచి అతన్ని పోలిస్‌స్టేషన్‌కు తరలించాలని ఆదేశించారు. దీంతో పూర్తి సమాచారాన్ని మహిళల నుంచి సేకరించారు. అదే కాలనీకి చెందిన లక్ష్మీ ప్రసన్న ఫిర్యాదు మేరకు ప్రేమ్ కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వరిగడ్డి దగ్ధం


కాలిపోతున్న గడ్డి చుట్టలు

కొలిమిగుండ్ల: స్థానిక కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చేరుకునే దారిలో పశువుల మేత కోసం నిల్వ ఉంచిన వరిగడ్డి చుట్టలు శనివారం కాలిపోయాయి. గ్రామానికి చెందిన పాడిరైతు తాళ్లూరి నరసింహులు పాడి గేదెలను ఏర్పాటు చేసుకుని పాలవ్యాపారం చేస్తున్నారు. ఇరవై రోజుల క్రితం అవుకు నుంచి 500 గడ్డి చుట్టలను కొనుగోలు చేసి నిల్వ ఉంచుకున్నాడు. సమీపంలోనే మద్యం దుకాణం ఉండడంతో మందు బాబులు మద్యం తాగి బీడీ తాగే క్రమంలో అగ్గిపుల్ల పడేసి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. బిందెలు, ట్యాంకర్ సాయంతో మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా అదుపులోకి రాలేదు. రామ్‌కో సిమెంట్ కంపెనీ నుంచి ఫైరింజన్ వచ్చి సమీపంలోని ఇతర గడ్డి వాములకు మంటలు వ్యాపించకుండా అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే చుట్టలు దాదాపుగా కాలిపోయాయి. రూ.50 వేల మేర నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు.

ముగిసిన మౌలాలి స్వామి ఉరుసు


మౌలాలి స్వామి గ్రామోత్సవం


భారీగా తరలివచ్చిన భక్తులు

ప్యాపిలి: మండల పరిధిలోని పోతుదొడ్డి గ్రామంలో వెలసిన మౌలాలిస్వామి ఉరుసు శనివారం ఘనంగా ముగిసింది. చివరి రోజు మౌలాలి స్వామి గ్రామోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. వేకువజామున ఒంటి గంటకు ప్రారంభమైన గ్రామోత్సవం గ్రామ పురవీధుల మీదుగా సాగింది. ఉదయం 9 గంటల ప్రాంతంలో స్వామివారి గుర్రం కొండను ఎక్కే ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల జయజయ ధ్వానాల మధ్య స్వామివారి గుర్రం సునాయసంగా కొండపైకి ఎక్కడంతో ఉత్సవాలు ముగిశాయి. ఉరుసు సందర్భంగా ఏర్పాటైన దుకాణాల వద్ద సందడి వాతావరణం నెలకొంది.

ఫిట్‌నెస్ రెన్యూవల్‌కు నంద్యాల వెళ్లాల్సిందే

డోన్ రూరల్: ప్యాపిలి, డోన్, బేతంచెర్ల మండలాల్లోని ట్రాన్స్‌పోర్ట్ వాహనాల యజమానులు సోమవారం నుంచి వాహనాల ఫిట్‌నెస్ రెన్యూవల్ కోసం నంద్యాలకు వెళ్లాలని ఆర్టీఓ క్రాంతి కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ ఆదేశాల మేరకు అన్ని మ్యాన్యువల్ ఫిట్‌నెస్ తనిఖీలు శనివారం నుంచి నిలిపివేయడం జరిగిందన్నారు. నంద్యాల జిల్లాలోని చాకిరేవు వద్ద ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారని తెలిపారు. వాహనదారులు గమనించి నంద్యాలకు వెళ్లాలని పేర్కొన్నారు.

నేడు మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

ప్యాపిలి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం మద్యం, మాంసం విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి శివకుమార్ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు జాతీయ పండుగ రోజున మద్యం, మాంసం దుకాణాల యజమానులు ఈ విక్రయాలు చేపట్టరాదన్నారు. దుకాణదారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేయాలని లేనిపక్షంలో వ్యాపార ట్రేడ్ లైసెన్సులు రద్దు చేస్తామన్నారు.

28 నుంచి సామాజిక సమరసత యాత్ర

కొలిమిగుండ్ల: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ నుంచి సామాజిక సమరసత యాత్ర కొలిమిగుండ్ల మండలంలో రెండు రోజుల పాటు జరుగుతుందని ఆ సంస్థ సభ్యుడు శ్రీనివాసులు శనివారం తెలిపారు. మొదటి రోజు మంగళవారం అవుకులో ప్రారంభమై బెలుం శివాలయం, కొలిమిగుండ్ల ఎస్సీ కాలనీలో జరుగుతుందన్నారు. 29న రాఘవరాజుపల్లె ఆంజనేయస్వామి ఆలయం, తిమ్మనాయినపేట వెర్రిగోవిందరాజుల స్వామి ఆలయానికి యాత్ర చేరుకుంటుందని పేర్కొన్నారు. ఈ యాత్ర ఫిబ్రవరి 2న వైఎస్సార్ జిల్లాలోని బ్రహ్మంగారి మఠంలో ముగుస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ యాత్రలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

పశుపోషణతో అదనపు ఆదాయం


బుగ్గానిపల్లెలో జీవాలకు మందు వేస్తున్న వెటర్నరీ ఏడీ

బేతంచెర్ల: రైతులు వ్యవసాయంతో పాటు పశుపోషణ, గొర్రెలు, మేకల పెంపకంతో మంచి ఆదాయం పొందవచ్చని వెటర్నరీ ఏడీ వసంత లక్ష్మి అన్నారు. శనివారం మండల పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో ఉన్న 45 పశువులకు టీకాలు వేశారు. మేకలు, గొర్రెలు, దూడలకు నట్టల నివారణ మందులు తాపించారు. పాడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

దాడి కేసు నమోదు

బేతంచర్ల: మండల పరిధిలోని ముద్దవరం గ్రామంలో మీనిగ ప్రసాద్, తల్లి జయమ్మ తమ స్థలంలో ట్రాక్టర్ ఎందుకు ఆపుతున్నారని అడిగినందుకు అదే గ్రామానికి చెందిన బోయ ఎర్రమల, అతని కుమారులు రాజశేఖర్, కుమార్, అల్లుడు రమేష్ గొడవ పెట్టుకుని దాడి చేసి గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.


దోబీ ఘాట్ వద్ద బట్టలు ఉతుకుతున్న రజకులు

రజకులకు కరెంట్ కష్టాలు

కొలిమిగుండ్ల: బోరు, దోబీ ఘాట్ ఉన్నా కరెంట్ సౌకర్యం లేక రజకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇన్నాళ్లు ఎక్కడో గుంతలు, కుంటల్లో బట్టలు ఉతికేవాళ్లు.. దోబీ ఘాట్ వచ్చి తమ సమస్య పరిష్కారమైందని సంతోషపడిన రజకులకు కరెంట్ రూపంలో సమస్య వేధిస్తోంది. కొలిమిగుండ్లలో దాదాపు ఏడాది క్రితం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎంపీగా పని చేసిన పోచా బ్రహ్మానందరెడ్డి దోబీ ఘాట్ నిర్మాణం కోసం రూ.10 లక్షల నిధులు మంజూరు చేయించారు. తర్వాత దోబీ ఘాట్‌తో పాటు బోరు ఏర్పాటు చేశారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం దరఖాస్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయకపోవడంతో రజకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 25 కుటుంబాలు రజక వృత్తి మీదనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. బట్టలు ఉతికేందుకు ఎక్కడా నీళ్లు అందుబాటులో లేవు. చివరకు దోబీ ఘాట్ సమీపంలోని రైతు పొలంలో నుంచి గంటకు రూ.100 వెచ్చించి విద్యుత్ సౌకర్యం పొందుతున్నారు. రెండు రోజులకు ఒకసారి కరెంట్ సాయంతో తొట్టిలో నీళ్లు నింపుకుని బట్టలు ఉతుక్కోవాల్సిన పరిస్థితి ఉందని రజకులు పేర్కొన్నారు. వేసవిలో తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. అధికారులు త్వరగా ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసి తమ సమస్య పరిష్కారం చేయాలని రజకులు కోరుతున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ హత్యపై నిరసన


కోవెలకుంట్లలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధి సిబ్బంది


బనగానపల్లె: నిరసన తెలుపుతున్న ఉపాధిహామీ సిబ్బంది

కోవెలకుంట్ల: కర్నూలు జిల్లా అలూరు మండలం అరికేర గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్న దారుణ హత్యను ఖండిస్తూ శనివారం స్థానిక ఉపాధి పథక కార్యాలయం ఎదుట సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. జేఏసీ పిలుపు మేరకు టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు నల్లబ్యాడ్జీలు ధరించి కొన్ని నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జేఏసీ జిల్లా నాయకుడు జయభారత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఫీల్డ్ అసిస్టెంట్‌ను హత్య చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. టెక్నికల్ అసిస్టెంట్లు కొండారెడ్డి, ఫకృద్దీన్, రాధాదేవి, కంప్యూటర్ ఆపరేటర్లు కిరణ్, గిరి, ఓబుళ పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

బనగానపల్లె రూరల్: ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్నను హత్య చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఉపాధి కార్యాలయం వద్ద ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ హత్య ఉపాధి హామీ పథకంలో పనిచేసే ప్రతి ఉద్యోగిని కలచి వేసిందన్నారు. ఈరన్న కుటుంబానికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఏపీఓ రేష్మా, ఈసీ మక్బుల్, కంప్యూటర్ ఆపరేటర్ చిన్నచంద్రుడు, టీఏలు షబ్బీర్, చంద్ బాషా, రాంభూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ఆర్పీలకు శిక్షణ

బేతంచెర్ల: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ వర్తింపజేసేందుకు ఆర్పీలు కృషి చేయాలని బేతంచెర్ల నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్ అన్నారు. శనివారం నగర పంచాయతీ కార్యాలయంలో ఆర్పీలకు ఒక్క రోజు శిక్షణ తరగతులను ప్రారంభించారు. నగర పంచాయతీలో ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వినియోగానికి స్వస్తిపలకాలన్నారు. మెప్మా టౌన్ కోఆర్డినేటర్ సూర్యనారాయణ పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్ ఎదుట ఉంచిన బారికేడ్లు

స్టేషన్‌కు చేరిన బారికేడ్లు

సాక్షి ఎఫెక్ట్

డోన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న బారికేడ్లను పోలీసులు స్టేషన్‌కు చేర్చారు. ఇదేమి నిర్వాహకం అనే శీర్షికతో శనివారం సాక్షి దినపత్రికలో వచ్చిన వార్తకు సీఐ ఇంతియాజ్ బాషా స్పందించారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం దాతలు విరాళంగా అందజేసిన బారికేడ్లను ముగ్గుల పోటీ నిర్వహణ పేరుతో పలు ప్రాంతాలకు కొందరు ఎత్తుకెళ్లి చెట్ల పొదల్లో పడేసిన ఉదంతాన్ని సాక్షి వెలుగులోకి తెచ్చింది. స్పందించిన సీఐ శనివారం ఉదయం ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసి పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న బారికేడ్లను పట్టణ పోలీస్‌స్టేషన్ దగ్గరకు చేర్చారు. దీనిపై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.